
‘కథ చెప్పినవారు....?’

# ఆ మాట శాస్త్రి విన్నాడు



• షట్టి కృష్ణమూర్తి •

“ఎన్నడైనా, ఎక్కడైనా, ఒక వ్యక్తి తనకి తెలియకుండానే దేనిలోఅన్నా పాల్గొంటూ వుంటాడంటావా? అదేమీకాదు బ్రదర్! నిన్నకాక మొన్న నాతో అలా చెప్పిన పెద్దమనిషి రెండు రోజులుగడిచేసరికి మరోధోరణిలో పడిపోయాడంటే ఏమనుకోవాలి? నన్ను ఎలాగైనా మోసగించి, వాడిపని వాడు నెరవేర్చుకుని కులుకుతూ కూచోవాలని ఆశగావున్నా. ఏహ్హా మనమంటే ఏమిటో అనుకుంటున్నట్లున్నాడు. అసలు ఇంతింతవాళ్ళకే మనం అందుతామా? ఎంతమంది చీమల్లా, దోమల్లా హతమైపోయారు, మన చేతిలో? నేటికీ, వీడొకమనిషినంటూ బయలుదేరి ఎదట నుంచుని పైగా కళ్ళల్లో కారంకొట్టడానికికూడా ప్రయత్నిస్తున్నాడంటే...మన తడాఖా ఇహనైనా తెలుసుగోకపోడు. ఇహ్హహ్హ. తన సహజధోరణిలోనే ఇంకా మాట్లాడుకుపోతున్నాడు శాస్త్రి. ఇప్పుడేకాదు. అతనెప్పుడు మాట్లాడినా అంతే. ఎదటివాడికి విసుగ్గా వున్నదని తెలిసినా.

తను చెప్పే మాటలు వినడంలేదని తెలిసినా అట్టే వూరుకుని మెదలకుండా కూచునే స్వభావం కాదు అతనిది. అనుకున్నది పూర్తయేవరకూ, ఫుల్‌స్టాప్, కామాలు లేకుండా అలా మాట్లాడేస్తూనే వుంటాడు. అందుకనే అతన్ని గాలికబుర్లు చెప్పేవాడు అంటారు గాలి మనిషి అంటూంటారు.

ఎదురుకుండా చాపమీద కూచుని, అతనిమాటలు పెడచెవినిబెట్టి ఏదో పుస్తకం చూసుకుంటున్నాడు ప్రకాశరావు.

శాస్త్రి కుర్చీలోనించి ముందుకు వంగి, “ఏంరా బ్రదర్!” అంటూ ఇంకేమేమో చెప్పబోతున్నాడు.

ప్రకాశరావు తలపైకెత్తి, “ఏమిటిరా ఈ ఉరుములూ మెరుపులూను” అన్నాడు. అతని పెదవులమీద ఇష్టంలేని చిరునవ్వు కనపడింది.

“ఎహ్హే. మీరంతా వొట్టి చచ్చువెధవలై ఇంట్లో కూచున్నారు. ఏమన్నా తడాఖా చూపిస్తే మనం” అన్నాడు శాస్త్రి, మీసం మెలేసే ఠీవితో.

“ఇహ ఎప్పుడూ అదే గొడవరా నీకు. ఈ వెధవ వ్యవహారాల్లో పడి మిగతా ప్రపంచమే మరిచిపోయినట్లున్నావ్.”

ఒక్కకథ చదువుతాను ఏమన్నా వినగలవా?

“మ్చ్” అని చప్పరించి వూరుకున్నాడు శాస్త్రి.

“ఏం?” అని ప్రశ్నించింది కనుబొమలు ముడిపడిన ప్రకాశరావు మొహం.

‘ఆ పేరు చెబితేనే నాకు పరమ అసహ్యం. మితిలేని విసుగూను. అసలిప్పుడు కథ అంటూ వ్రాసే మొనగాడెక్కడున్నాడోయ్? అందుకే నేను చదవను, విననుకూడాను.’

‘అయితే ఒకప్పుడు నువ్వు మెచ్చుకున్న రచయితలుకూడా వున్నారన్నమాట.’

‘రచయితలు’ అనడానికి అసలు వీలులేదు. ఒక్కడంటే ఒక్కడే. మా శర్మగారు వ్రాస్తున్నాడు నేటికీను. ఇప్పుడు కుక్కగొడుగుల్లా పుట్టుకొచ్చిన ప్రతివాడూ, నేనూ రచయితనే అని బయలుదేరితే? నేనుమటుకు చదివితే ఆయనవే చదువుతాను. మరో వెధవ వ్రాస్తే చదవాల్సిన అవసరమేముంది?

‘అందుకని?’

‘ఆ ఫీల్డులో చస్తే దిగకూడదని బాయ్‌కాట్ చేశాను అంతే.’

* [illegible]

'అరే శాస్త్రీ! నీకు కోపం వస్తే చెప్పలేను గాని అసలు నువ్వు మనిషిగా నిలబడిన తరువాత ఎన్ని కథలు వ్రాశావ్? ఎవరో దారే పోయేవాళ్ళు చెప్పుకుంటున్నట్లు అంత బాధ్యతారహితంగా నీ బోటివాళ్ళు కూడా మాట్లాడుతూంటే?'

'అయితే ఏమవుతుంది? ఏమీ కాదు. అదీ! ఇది నా సొంత అభిప్రాయమోయ్.'

'ఇట్లా నువ్వు వాగే ప్రతిమాటా సొంత అభిప్రాయంకింద జమకట్టి బుకాయిద్దామని చూస్తున్నా వన్నమాట. అసలీ విషయాన్ని గురించి ఒక అభిప్రాయమంటూ ఇవ్వడానికి నీకేం అధికారముంది?'

'ఏం?'

'అసలీ ఫీల్డులోంచి విరమించుకున్నానని నువ్వేకదా అన్నావ్.'

'అందుకని.'

'నీబోటిగాళ్ళ మరామ్మతు మాకవసరం లేదని చెబుతున్నా. నీ మనస్సులో వున్న వ్యక్తి నీకు గొప్పవాడైతే కావచ్చు. కాని, వాడి పేరుచెప్పి మమ్మల్ని ఎన్నడూ వాగ్బంధం చెయ్యలేవు.'

ఇంతలోనే మూర్తి వొచ్చాడు అక్కడికి. ప్రకాశరావుకివనే మూర్తికికూడా శాస్త్రి మొదటినించీ ముఖ్యస్నేహితుడే. కాని, అతని మాటలు వింటూంటే మితిలేని చిరాకు పుడుతూంటుంది మూర్తికి. వాళ్ళిద్దరూ వొకచోట కూడితే ఏదో విషయంలో వాగ్వాదం జరగక తప్పదు.

మూర్తికి కథలు వ్రాయడమంటే ఎంతో యిష్టం. ప్రకాశరావూ తనూ కూచుని ఎప్పుడూ వ్రాస్తూంటారు కూడాను. శాస్త్రి ఎదటకనక ఏదైనా కథ చదివితే అరంతేని పోట్లాట చాలా జరుగుతుంది. అసలు కర్మమేమిటంటే ఈ కథ బాగున్నదని ఒక్కనాడైనా అనడు శాస్త్రి.

మూర్తి ఆరోజున ఏ కథనూ తీసుకురాలేదు.

కాని ప్రకాశరావు చదువుతానన్న కథను చదివాడు.

'ఖూనీ చేశావ్' అన్నాడు శాస్త్రి.

"అసలు నీకా కథలో ఏం బాగుండలేదో చెబుతావా?" అన్నాడు మూర్తి.

'నాకసలు కథే బాగుండలేదు' అన్నాడు శాస్త్రి నిర్లక్ష్యంగా.

"అది నీ ఖర్మ. మమ్మల్ని ఏం చెయ్యమంటావ్?" అన్నాడు మూర్తి.

"ఇలాంటి వెధవకథలన్నీ వ్రాయకుండా మానెయ్యమంటూ."

"నీరకం మనుషులు కొంత మరామ్మతు కావలసుందిరా బ్రదర్! ఒకదాన్ని యథాతథంగా మెచ్చుకోలేరు. అందుకని దూరంగానూ వుండరు. ఏదో వొక పేరుపెట్టి, ఒక అభావాన్ని కల్పించి బాగుండలేదని త్రోసిపారేస్తే మీరసలు వింటమే అనవసరమంటాను. ఈ రకం మనుష్యులున్నారు చూశావ్. చాలా డేంజెరస్" అన్నాడు మూర్తి.

ఎవరి యిష్టంవొచ్చినట్లు వాళ్ళు వ్రాస్తూంటారు. మనిషికోవిధమైన సమస్య మనసులో తోస్తూంటుంది. సమయానికొకవిధమైన సంఘటన చూస్తూంటాడు. వాడికొక నిబంధన ఏమిటి? కాని, వాడు వ్రాసిందిమాత్రం ప్రస్తుతానికి ఉపయోగిస్తుందా లేదా అని సరిచూసుకుండే వ్యవధి మాత్రం అవసరమంటాను' అన్నాడు ప్రకాశరావు.

"నువ్వేరకంకథలు వ్రాయాలని నిబంధిస్తావ్?" అన్నాడు మూర్తి, శాస్త్రితో.

'వాడెన్నుకున్న పరమగురువులామటుకు మన మెన్నడూ వ్రాయం' అన్నాడు ప్రకాశరావు.

"అసలు నీబోటిగాళ్ళంతా దూరంగాకూర్చుని ఇష్టంవొచ్చినట్లు మాటలుమాత్రం విసురుతూంటారు. కాని ఈ రచన ఇలా ఉండాలి అని నిరూపించవలసిననాడు అంతూపంతూ వుండరు. క్రొత్త పంథాలో ఒక విశిష్టరచన తీసుకురాగల సామర్థ్యం వాళ్ళకెక్కడుంటుంది?" అన్నాడు మూర్తి.

"ఇలా మాట్లాడుతుంటే ఏదో ఉత్సాహంతో పొందుకు నడిచిపోయేవాళ్ళని వెన్నులో పొడిచినట్లే అవుతుంది" అన్నాడు ప్రకాశరావు. ఈ మాటలో అతని ముఖంలో ఇదివరకు లేని రౌద్రం కనపడింది.

"అందుకనేగా రెండుకథలు వ్రాసేసరికి స్వాభిమానంతో ఇక వ్రాయకుండా చేశాడు. నిజంగా వీడిమూలంగా ఆవిడ యెంత బాధపడుతోందో" అన్నాడు మూర్తి సాభిప్రాయంగా. ఇక మాట్లాడకుండా అతనివంక చూసి కనుసన్నతో వారించాడు ప్రకాశరావు.

"మీరంతా ముందమోపి కథలు వ్రాసి ఎవర్ని మరామ్మతు చేస్తారో."

"అవును తప్పకుండాను. ఏమన్నా మరామ్మతు అవసరమైతే అది జరిగేలాగానే మా రచనలు తీసు

గుపస్తాం. ప్రజలు తప్పకుండా చదువుతారు. అందులో వారికి కావలసిన సత్తా ఏమన్నా వుంటే ఎందుకు గ్రహించరు?"

మూర్తి, ప్రకాశరావూ ఇలా అంటూండగానే శాస్త్రి కోపంతో లేచిపోయినాడు.

★

శాస్త్రికి పెండ్లి అయేసరికి శారదకూడా అతనితోపాటు ఇంటర్‌మీడియేట్ చదువుతున్నది. కాని 'తను ప్యాసయితేనే శారదకూడా బి.ఏ. చదవాలి' అని శాస్త్రి పెట్టిన యీ షరతుకు శారద ఎంతో ఖిన్నురాలయింది. తనొక అడుగు ముందుకు నడవాలంటే తన భర్తకూడా నడవాలన్న మాట.

ఇది తన్ను నిబంధించడమే అయినా ఆ నైతిక సూత్రానికే కట్టుబడివున్నది శారద. శాస్త్రి కూడా ప్యాసవాలని ఎన్నో దైవాలని ప్రార్థించింది. కొద్దిరోజులలోనే తెలిసిన పరీక్షాఫలితాలు శారదను పూర్తిగా మోసం చేసినై. శారద అభివృద్ధిని కాంక్షించని ఆ పాడుదైవం శాస్త్రిని ప్యాసుచెయ్యలేకపోయింది.

ఆశతో నిరీక్షిస్తున్న శారదకు శాస్త్రికూడా మోసంకాదు ద్రోహమే చేశాడు.

ఎన్నోనాళ్ళు శూన్యతిథులుగా గడిచిపోయినై.

కొన్నాళ్ళకి శారద బి.ఏ. చదవటానికి ప్రయత్నిస్తున్నదని తెలిసింది. శాస్త్రి ఒక ఉత్తరం వ్రాశాడు 'నేను ఇంటర్‌మీడియెట్ ప్యాసు కాకుండా నువ్వు బి.ఏ. చదివితే ఇక నీ శాస్త్రి నీకు దక్కడు' అని.

పురుషకారాన్ని మరచిన తన బలహీనతకు శారద ఎంతో అసహ్యించుకున్నది. ఈ బాధ్యత తనమీదపడటం మోయలేని అభివృద్ధినిరోధకమైన శక్తిగా తోచింది. ముందుకు వేసిన అడుగు నిరాశగా, బాధగా వెనక్కు తీసుకున్నది.

★

కాపరానికి వొచ్చింది శారద. ఆ సరిహద్దు లోపలనే వున్న జీవితంలో అనుదినమూ కనే పరిణామాలు సంస్కృతమైన శారదహృదయాన్ని కలచివేసినై. తనకున్న భావాలుకూడా లోకానికి నివేదించగల స్వేచ్ఛ వున్నదని నిర్ణయించుకున్నది. మానవజీవిత ఇతివృత్తాన్నే నిత్యనూతనంగా చిత్రించాలని ఆమెకు సహజంగా కలిగిన కోరిక.

"జాబిల్లి కథ విన్నే పసిపాపాయి ఏడుపు మాని అన్నం మెందుకు తింటాడు. ఆ చిన్నకథలో సైతం అతనికి తెలియని ఏదో వొక ఆనందం ఇమిడిలేదూ? జీవితమే ఒక గాథ. ఈ వాస్తవిక సత్యాన్ని నిరూపించేదికూడా అదొక గాథే అవుతుంది. అందుకనే ఎట్టి మానవహృదయమైనా జీవిత సత్యాన్ని నిరూపించే కథకు జోహారు లిస్తుంది. అందుకని ఎంతటి విచిత్ర సంఘటనలైనా సున్నితంగా మానవహృదయానికి హత్తుకునేటట్లు చేయగల సామర్థ్యంకూడా దానికే వున్నది" అనుకున్నది శారద.

కథారచనలో నిమగ్న అయింది.

రెండుకథలు పత్రికలో ప్రకటింపబడినై, చదివే ప్రజానీకం రచయిత్రిని అభినందించారు. మన

---

## — విషమపరిస్థితి —



డైరక్టరు: "ఈ సీనులో యీ విలన్ కథానాయికను నిర్బంధిస్తూండగా నీవు వానిపైబడి ద్వంద్వయుద్ధం చేయాలి, ఆ ఘోర యుద్ధంలో మీరిద్దరూ నేలమీదబడి క్రిందామీదా అవుతూంటారు, ఆ మల్లయుద్ధంలో నీవు క్రిందబడిపోగా, నీ ఛాతీపై యీ విలన్ కూర్చొని అణచివేస్తూ బాకుతో పొడవడానికి సిద్ధమౌతూండగా నీవు ఒక్క ఊపుతో వానిని క్రింద బడద్రోసి కత్తితో పొడిచి హతమార్చాలి, కథానాయికను రక్షించుకొనిపోవాలి."

కథానాయకుడు: "ముందు నా జీవితం భీమా చేయించుకోవాలి, ఆతర్వాత నటిస్తాను."

* ఆనందవాణి

సమస్యల్ని పరిష్కరించే ఇలాటి రచనలు పరం పరగా వెలువడుతూండాలని ఆకాంక్షించారు. వారి యీ శుభాకాంక్ష పరోక్షంగా శారద నాశీర్వదించింది.

అది స్వాభిమానమో, అసూయో, దురభిమానమో, శారద చక్కని కథలు వ్రాస్తూంటే చూసి సహించలేకపోయినాడు శాస్త్రి. ఇక ఆమె కథ పత్రికలో పడితే సహించనన్నాడు. ఇక నెలాగైనా ఆమె నా ప్రయత్నంనుంచి మాన్పించాలని విశ్వప్రయత్నం చేశాడు.

కొన్నాళ్ళు "అనూరాధ" అన్న పేరుతో శారద కథలు ప్రకటించింది.

మరి కొంతకాలానికి కథారచననే నిషేధించాడు శాస్త్రి.

శారద ఎంతో బ్రతిమాలింది. చదువుకోకుండా అడ్డుతగిలిన తన లేఖను చూపించింది. "నన్నొక కథకూడా వ్రాసుకోనివ్వరా?" అని జాలిగా అడిగింది. ఇదే నాకొక తృప్తి, ఇక స్వల్ప ఆనందం, దీన్నికూడా అనుభవించనీయరా? అని కళ్ళనీళ్ళు పెట్టుకున్నది. తన కర్కశహృదయం ఆ జాలి చూపులకి కరగలేదు.

కాని పల్లవించి పుష్పించే శారదహృదయంలో కల ఏలాం భావాలు ఆమెచేత కథలు వ్రాయిస్తూనే వున్నై.

★

ఒకనాడు శారద దొడ్లో మామిడిచెట్టుక్రింద కూచుని కథ వ్రాసుకుంటున్నది. తనకి యిష్టం లేకుండా వ్రాస్తున్నందుకు ఆ కాగితాలు చింపి పారవేశాడు. శారదహృదయం చీరుకు పోయింది.

నాటినించీ "కథ"లంటే ఒక గుడ్డిద్వేషం ప్రబలింది శాస్త్రిలో.

ఒకనాడు ఇద్దరు చిన్నపిల్లలకి చక్కని కథ చెబుతూంది శారద. ఆ కథ వినేసరికి అతనికి తల కొట్టినట్టయింది, లేనిపోని ఒకపనిని కల్పించి శారదను అక్కడనించి పంపాడు. కథ వింటూన్న ఆ చిన్నపిల్లలు కొంగుపట్టుకొని శారదతోకూడా నడిచివెళ్ళారు.

ఒక దుష్టశక్తి తనచేత శారద నా యత్నం మాన్పింప జూస్తుంటే, ఆమెలో కల ఏదో వొక అభ్యుదయశక్తి కథలు వ్రాయిస్తూనే వున్నది.

ఆ రెండు విభిన్నశక్తులూ సంఘర్షిస్తుంటే, రెండు జీవితాలూ, కాంతిలేని దీపాలులా వెలుగుతున్నై.

తను శారదహృదయాన్ని అర్థంచేసుకోలేని మొరటుమనిషి అయినాడు. లేనిపోని వ్యవహారాల నెత్తినవేసుకు తిరిగే వ్యాజ్యాలకోరు అయినాడు. వూరివెంట తిరిగే ద్రిమ్మరి అయినాడు.

ఏనాటికైనా తను వ్రాసుకున్న కథలు ప్రకటింపబడి ప్రజల చేతుల్లోనికి వెడతాయా? అని నిరీక్షిస్తోంది శారద, ఆదరంలేని బిడ్డలా ఆ కథలు చూసినప్పుడు ఆమె కెంతో విచారాన్ని కలిగించుతై.

తను వ్రాసిన కథలన్నీ చీరమడతలో పెట్టుకుని తనపెట్టెలో అడుగున దాచుకుంది శారద. ఎట్టి అసాధారణ పరిస్థితుల్లోనైనా శాస్త్రి కంటబడకుండా వుండాలని ఆమె ఎన్నో దైవాలను ప్రార్థించింది. జాలిలేని రాతిదేవుళ్ళు పరోక్షంలో శారదకు ద్రోహం చేసినై. శాస్త్రికి ఆ కథలు చూపించినై. శారదమీద పట్టరాని కోపాన్ని కలిగించినై. ఆ క్రోధాగ్నిలో శారదకథలన్నీ—

శారద అతని నెన్నడూ నగలూ నాణ్యాలూ కోరలేదు. అసలామెకు అవసరంలేదుకూడాను. ఇన్నాళ్ళనించీ తనజీవితంలో సంపాదించుకున్న ఘనమైన వైజ్ఞానిక ప్రతిరూపాలు యీ రచనలు. వాటిని నాశనంచేసి శారద వైజ్ఞానికశక్తిపై పెద్ద దెబ్బకొట్టాడు శాస్త్రి. అది అసహజమే కాదు అమానుషంకూడాను.

"ఇక్కడికి మీ ప్రతీకారం పూరయినట్టేనా?" అన్నది శారద. ఆ మాటలో శోకమూ, ఆవేశమూ ప్రతిధ్వనించినై. శారద ఇంక వ్రాయకుండా వుంటుందనే శాస్త్రి అంతరంగంలో కలిగే సంతృప్తి.

శారద పుట్టింటికి వెళ్ళింది.

ఒకనాడు తనకి పోస్టులో మూడుపత్రికలు వొచ్చినై, శారద వ్రాసిన కథలు చూశాడు. ఇవి చింపితే?...

ఒకనాడు షాపులో కూచుని అందరితోనూ కథారచన పనికిరాదని చర్చిస్తున్నాడు శాస్త్రి— రేడియోలో ఎవరో కథ చెబుతున్నారు-అందరూ విన్నారు—"కథ చెప్పినవారు" డి. శారదగారు, ఆ మాట శాస్త్రికూడా విన్నాడు- ఆ శారద ఎవరు?

ANANDAVANI is printed by V. AZIZULLA at Deccan Times Press Madras,
and published by V. KALIDAS, at 12 Thambu Chetty Street, Madras
Editor: V. KALIDAS, Associate Editors : Andra Seshagiri Rao B.A., Mudda Viswanadham.